సాక్షి చిత్తూరు

ఆదివారం । 18 । ఫిబ్రవరి । 2024



ఊంజల్ సేవలో కల్యాణ వెంకన్న

నారాయణవనంలోని పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఊంజల్ సేవను నేత్రపర్వంగా నిర్వహించారు.



తాగునీటి బకాయిలు విడుదల

కుప్పం నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న తాగునీటి బకాయిలు రూ.17 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది.

- 8లో



సాహో ఇస్రో

సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌లో రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్‌వీ-ఎఫ్14 ప్రయోగం విజయవంతం అయింది.

- 8లో

న్యూస్‌రీల్

చిరుధాన్యాల పుస్తక ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీ శ

పుత్తూరు: మామిడి సాగులో సేంద్రియ విధానాలపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని మారుమూల ప్రాంతాలకు చేరవేయాలని జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశకు వడమాలపేట రైతు సలహా మండలి సభ్యుడు కిరణ్‌కుమార్ నివేదిక అందజేశారు. శనివారం జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడమాలపేట, పుత్తూరు మండలాల్లో మామిడి తోటలు విస్తారంగా ఉన్నాయని తెలిపారు. పంట దిగుబడి సమయంలో చీడపీడల నుంచి పంటను రక్షించుకునేందుకు రైతులకు తగిన సూచనలు, సలహాలను మారుమూల ప్రాంతంలో ఉన్న చిన్న, సన్నకారు రైతులకు సైతం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ చిరుధాన్యాల పంటలు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా అతిథి గృహం



అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ

పుంగనూరు: పట్టణంలోని ట్రావెలర్స్‌బంగ్లాలో నిర్మించిన జెడ్పీ అతిథి గృహం ప్రారంభానికి సిద్ధం అవుతోందని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన అతిథి గృహాన్ని పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను సత్వరమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు ప్రారంభోత్సవం తేదీని ఖరారు చేస్తామన్నారు. సుమారు రూ.2 కోట్లతో నిర్మించిన అతిథిగృహం అత్యంత నాణ్యతతో నిర్మించడం జరిగిందని తెలిపారు. అలాగే గెస్ట్‌హౌస్‌కు వేసిన నూతన రోడ్లు, ప్రహరీని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ మురుగప్ప, ఆర్‌డబ్ల్యూఎస్‌డీఈఈ వెంకటేశ్వర్లు, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, చంద్రహాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సిరి

సామాన్య, మధ్య తరగతి కుటుంబాల్లో ఎవరైనా అనారోగ్యం పాలైతే ఆస్పత్రి ఖర్చులు భరించలేక, అప్పులపాలై ఆ కుటుంబం చితికిపోయేది. నేడు ఆ పరిస్థితి లేదు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలందరికీ కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. గత ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ పథకానికి తూట్లు పొడిస్తే 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పథకం పునరుద్ధరణ చేసింది. ఆపదవేళ పేదవాడి ప్రాణదాతగా నిలుస్తోంది. సీఎం జగన్ సర్కార్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచడంతో పాటు గతంలో 1059 జబ్బులకు మాత్రమే వైద్యసేవలు ఉంటే, దాన్ని 3257కు పెంచి ఆదుకుంటోంది.



నగరి ఏరియా ఆస్పత్రిలోని ఆరోగ్యశ్రీ కౌంటర్

- పేదవాడి ప్రాణదాత అయిన ఆరోగ్యశ్రీకి తూట్లు పొడిచిన గత ప్రభుత్వం
- 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే అధిక ప్రాధాన్యత
- జిల్లాలో 68 ఆస్పత్రుల్లో అమలు
- 30 విభాగాల్లో 3,257 జబ్బులకు చికిత్స
- 3.38 లక్షల మందికి రూ.243.8 కోట్ల మేర శస్త్రచికిత్సలు
- 1.37 లక్షల మందికి రూ.147.2 కోట్ల ఆరోగ్య ఆసరా
- ప్రజారోగ్యానికి సీఎం జగన్ సర్కార్ పెద్దపీట

జిల్లావ్యాప్తంగా వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో చేసిన సర్జరీలు, వ్యయం

సంవత్సరం	శస్త్రచికిత్సల సంఖ్య	ప్రభుత్వ వ్యయం (కోట్లలో)
2019-20	43898	96.29
2020-21	51173	99.71
2021-22	75941	13.48
2022-23	83816	18.04
2023-24	82954	16.31
	337742	243.81

జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ ఆరోగ్య ఆసరా..

సంవత్సరం	శస్త్రచికిత్సల సంఖ్య	ప్రభుత్వ వ్యయం (కోట్లలో)
2019-20	6310	3.62
2020-21	17286	90.01
2021-22	30285	13.99
2022-23	43065	20.01
2023-24	39876	19.56
	136822	147.19



నగరి: రాష్ట్రవ్యాప్తంగా 2,127 ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్యసేవలు అమలు అవుతున్నాయి. అందులో చిత్తూరు జిల్లాలోని 68 ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో, నగరి నియోజకవర్గంలో 8 ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకం సేవలు అందుబాటులో ఉన్నాయి. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు ద్వారా 30 విభాగాలలో 3,257 జబ్బులకు వైద్యం అందిస్తున్నారు. 30 సాధారణ సర్జరీలు, 14 క్లిష్టమైన సర్జరీలు ఈ పథకంలో జరుగుతున్నాయి. మన రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, బెంగళూరు, చెన్నై లాంటి మహానగరాల్లో 204 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో 716 జబ్బులకు ఆరోగ్యశ్రీ పథకంలో వైద్య సేవలు అందిస్తున్నారు. క్యాన్సర్ లాంటి ఖరీదైన జబ్బుల చికిత్సకు పరిమితి లేకుండా అవసరమైన సాయం అందిస్తున్నారు.

ఆరోగ్యశ్రీకి జీవం పోసిన జగన్ సర్కారు..

మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం గత పాలనలో పూర్తిగా ఉనికిని కోల్పోయింది. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరోగ్యశ్రీ పథకానికి ఊపిరిపోసి అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారు. అప్పటివరకు పెత్తందార్లకు మాత్రమే అందుబాటులో ఉన్న కార్పొరేట్ వైద్యాన్ని పేదలకు అందుబాటులోకి తెచ్చారు. ఆర్థికంగా బలంగా ఉన్నవారు వైద్య బీమా పేరిట వేలకు వేలు చెల్లించి వాటి ద్వారా లక్షలకు లక్షలు వైద్యసేవలు పొందుతుంటే అలా చెల్లించలేని పేదవాని పక్షాన ప్రభుత్వం నిలబడింది. అప్పటివరకు రూ.5 లక్షల వరకే పరిమితమైన ఆరోగ్య వైద్యసేవలు రూ.25 లక్షల వరకు పెంచడంతో ప్రతి పేదవాడికి ఆరోగ్య భరోసా ఏర్పడింది. శస్త్రచికిత్స అనంతరం రోగి కోలుకునే వరకు జీవనభృతి కోసం వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకం కింద ఆర్థికసాయం అందిస్తున్నారు. ఈ పథకంలో జిల్లాలో ఇప్పటివరకు 3.38 లక్షల మందికి ఆర్యోశ్రీ శస్త్రచికిత్సకు రూ.243.8 కోట్లు, 1.37 లక్షల మందికి ఆరోగ్య ఆసరాకు రూ.147.2 కోట్లు ప్రభుత్వం వెచ్చించింది. సామాన్యులకు కూడా పథకంపై అవగాహన కల్పించేలా ఆస్పత్రుల వద్ద ఆరోగ్యశ్రీ కౌంటర్లు ఏర్పాటుచేసింది.

క్యాన్సర్ బారి నుంచి రక్షిస్తున్నారు..

నగరి మండలం, ముడిపల్లి ఎస్టీకాలనీకి చెందిన జానకమ్మకు వయసు 63 సంవత్సరాలు. భర్త చలపతి కూలీ. రెండేళ్ల కిందట జానకమ్మ అనారోగ్యం బారిన పడడంతో భర్త ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి పలు మార్లు చికిత్స చేయించాడు. ఎంతకీ తగ్గకపోవడంతో స్విమ్స్‌కి వెళ్లి పరీక్షలు చేయించగా క్యాన్సర్ సోకినట్లు వైద్యులు తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం జానకమ్మకు ఊపిరిపోసింది. స్విమ్స్‌లోనే క్యాన్సర్‌కు ఉచితంగా చికిత్స అందించారు. ఇప్పటివరకు ఆరుసార్లు కీమోథెరపీ చేశారు. ఒకసారి ఆపరేషన్ చేసి ఒక క్యాన్సర్ కణితిని తొలగించారు. మరో కణితికి రేడియేషన్ ద్వారా చికిత్స అందిస్తున్నారు. పౌష్టికాహారానికి రోజుకు రూ.250 చొప్పున రూ.5వేలు ఆమె ఖాతాలో జమ చేస్తున్నారు. ఇన్నాళ్లు జీవిస్తున్నానంటే అది ఆరోగ్యశ్రీ, సీఎం జగన్ పుణ్యమే అంటోంది జానకమ్మ.

గుండెకు చికిత్స..



నింద్ర మండలం అత్తూరుకు చెందిన రోశిరెడ్డికి 60 ఏళ్లు. గతేడాది డిసెంబరులో అనారోగ్యం పాలయ్యాడు. స్థానిక ఆస్పత్రికి వెళ్తే గుండె సంబంధిత వ్యాధి ఉందని చికిత్స చేసుకోవాలని సూచించారు. ఆర్థికంగా వెనుకబడిన ఆ రైతుకు ఆరోగ్యశ్రీ పథకం బాసటగా నిలిచింది. తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో చేరి ఆరోగ్యశ్రీ పథకంలో గుండె సంబంధిత వాల్వ్‌లలో ఉన్న సమస్యను సరి చేసుకున్నారు. ప్రస్తుతం ఇంటి వద్ద సురక్షితంగా ఉన్నారు. ఈ పథకం ద్వారా రూ.60 వేలు లబ్ధి చేకూరినట్లు రోశిరెడ్డి తెలిపారు.

సీఎం జగన్ నడిపించారు..



విజయపురం మండలంలోని విజయపురం దళితవాడకు చెందిన ఈయన పేరు జయపాల్ (55). ఐదేళ్ల కిందట ఈయనకు తీవ్రమైన మోకాళ్ల నొప్పి వచ్చింది. పలు ఆస్పత్రులకు వెళ్లి చూపించుకోగా సర్జరీ చేయాలని, రూ.3 లక్షలకు పైన ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీ పథకాన్ని మెరుగుపరచడంతో పాటు పలు జబ్బులను ఆరోగ్యశ్రీ కిందకు తెచ్చింది. వైద్యం ఎలా చేయించుకోవాలని డైలమాలో పడ్డారు. దీనిపై అతను వైద్యులను సంప్రదించగా ఆరోగ్యశ్రీ ద్వారా సర్జరీ చేసుకోవచ్చని సూచించడంతో తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో సర్జరీ చేయించుకున్నాడు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా తనకు రూ.3 లక్షల వరకు లబ్ధి చేకూరిందని, ముఖ్యమంత్రి జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటానని జయపాల్ చెబుతున్నాడు.

కిడ్నీలో రాళ్లు తొలగించారు..



పుత్తూరు మున్సిపాలిటీ వత్తవాడ వీధికి చెందిన బి.రాజేష్ (30)కి కొంతకాలంగా కిడ్నీలో రాళ్ల కారణంగా తీవ్ర ఇబ్బంది పడుతున్నాడు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా గతేడాది జూన్‌లో తిరుపతిలోని రష్ ఆస్పత్రిలో చేరగా, వైద్యుల ఆపరేషన్ చేసి ఉచితంగా మందులు అందజేశారు. చికిత్స నిమిత్తం పుత్తూరు నుంచి తిరుపతికి రానుపోను చార్జీలను సైతం ప్రభుత్వమే చెల్లించింది. ఆరోగ్యం కుదుటపడే సమయంలో జీవన భృతి సైతం అందజేసింది. ఆరోగ్యశ్రీ ద్వారా తనకు రూ.40 వేలు వరకు లబ్ధి చేకూరిందని, ముఖ్యమంత్రి తనకు చేసిన సాయం మరచిపోలేని, ఆరోగ్యశ్రీ పథకం ఉపయోగపడుతోందని చెబుతున్నాడు.

కాలి ఎముకకు శస్త్రచికిత్స..



నగరి మండలం ముడిపల్లికి చెందిన కె.జయరాం (45) నెలరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. కాలి ఎముకకు తీవ్రగాయం కావడంతో మెరుగైన వైద్యం అవసరమని వైద్యులు సూచించారు. కూలి పని చేసుకునే జయరాం ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే. ఆ సమయంలో ఆరోగ్యశ్రీ పథకం కింద తిరుపతి రమాదేవి హాస్పిటల్‌లో కాలికి శస్త్రచికిత్స చేయించుకున్నాడు. వైద్యులు ఉచితంగా మందులు కూడా అందించి ఇంటికి పంపారు. ఇతనికి రూ.40 వేల మేర సాయం అందడంపై ఆరోగ్యశ్రీ పథకం లేకుంటే తాను చాలా ఇబ్బంది పడేవాడినని చెబుతున్నాడు.

నా బిడ్డకు జన్మనిచ్చింది..



ఈమె పేరు ఆయేషా, పుత్తూరు మున్సిపాలిటీ గాంధీనగర్‌లో నివశిస్తున్నారు. నిరుపేద కుటుంబం. ఈమెకు కాన్పు కష్టమని ఆపరేషన్ చేయాలని పుత్తూరులో వైద్యులు చెప్పారు. గతేడాది నవంబరులో తిరుపతిలోని మెటర్నిటీ ఆస్పత్రిలో వైద్యులు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఈమెకు ఆపరేషన్ చేసి పురుడు పోసి రెండు ప్రాణాలను రక్షించారు. ఆపరేషన్ తర్వాత ఈమె జీవనోపాధి నిమిత్తం రూ.5 వేలు బ్యాంకు ఖాతాలో వేశారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఈమె రూ. 25 వేలు మేరకు లబ్ధి పొందింది. వచ్చిన డబ్బుకన్నా తల్లి, బిడ్డ ప్రాణాలను ఆరోగ్యశ్రీ ద్వారా కాపాడిన సీఎం జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటానంటోంది.

దాగుడుమూతలు

సత్యవేడు నియోజకవర్గంలోని ఆశావహులతో చంద్రబాబునాయుడు చెడుగుడు ఆడుతున్నారు. ఒకరికి తెలియకుండా ఒకరికి ఫోన్లు చేసి నువ్వే అభ్యర్థివంటూ నమ్మబలుకుతున్నారు. ఆపై ఎవ్వరికీ తెలియకుండా తన వాయిస్‌తో వేరొక అభ్యర్థిత్వాన్ని తెరపైకి తెచ్చి ఫోన్ సర్వే చేయిస్తున్నారు. ఇన్నాళ్లూ బాబు మాటలు నమ్మి.. ఆయన హామీలకు తలొగ్గి తీరా మోసపోతామేమోనన్న ఆందోళనలో ఎస్సీ అభ్యర్థులు తికమకపడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలం పరిస్థితి అయితే రెంటికీ చెడ్డ రేవడిలా తయారైందని తెలుగులు తమ్ముళ్లు చెవులు కొరుక్కుంటున్నారు.



సత్యవేడులో బాబు నాలుగు స్తంభాలాట

- ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, మరో ఇద్దరితో చర్చలు
- ఒకరికి తెలియకుండా ఒకరికి నువ్వే అభ్యర్థి అంటూ హామీలు
- వైఎస్సార్‌సీపీని వీడి వస్తే టికెట్ నీకే అని ఆదిమూలంకు కండీషన్
- సీఎం వైఎస్ జగన్‌పై బురదజల్లేందుకు ఎమ్మెల్యేని ఉసిగొల్పుతున్న బాబు
- అయినా ఎమ్మెల్యేకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వని వైనం

సాక్షి, తిరుపతి: ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమైన సత్యవేడు టీడీపీ టికెట్ విషయమై జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. ఇక్కడ మొదటి నుంచి మాజీ ఎమ్మెల్యే హేమలత కుమార్తె డాక్టర్ హెలెన్‌కే టికెట్ అని చంద్రబాబు తన వారితో ప్రచారం చేయించారు. 2019 ఎన్నికల్లో సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలైన జేడీ రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే తలారి ఆదిత్య తనకే టికెట్ అని, చంద్రబాబు కూడా స్పష్టం చేశారని వారు చెప్పుకుంటున్నారు. మరోవైపు ఎమ్మెల్యే ఆదిమూలం తనకే టికెట్ అని ప్రచారం చేసుకుంటున్నారు. ఆ మేరకు చంద్రబాబు, లోకేష్ హామీ ఇచ్చారని, అందుకే పార్టీ మారుతున్నట్లు తన అనుచరులకు చెప్పుకుంటున్నారు. ఇదిలా ఉంటే.. తాజాగా చంద్రబాబు వాయిస్ రికార్డుతో మొబైల్ ఫోన్ ద్వారా చేపట్టిన సర్వేలో మాజీ ఎమ్మెల్యే గాంధీ మనుమరాలు చందన ప్రవంతి పేరు తెరపైకి వచ్చింది. ఈ సర్వేలో ప్రవంతి పేరు తప్ప మరొకరి ప్రస్తావన లేకపోవడంతో ఆశావహులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఒకరికి తెలియకుండా ఒకరిని నమ్మించి మోసం చేస్తావా? అంటూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన దళిత నేతలు చంద్రబాబు తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆదిమూలం రెంటికీ చెడ్డరేవడేనా?

తాజా సర్వేతో ఆదిమూలం ప్రస్తావనే లేకపోవడంతో ఎమ్మెల్యే, ఆయన వర్గీయులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కోనేటి ఆదిమూలం 2001లో కాంగ్రెస్ పార్టీని వీడి టీడీపీలో చేరారు. ఆపై 2004, 2009లో టికెట్ ఆశించి భంగపడ్డారు. తర్వాత వైఎస్సార్‌సీపీలో చేరి, 2014లో సత్యవేడు నుంచి పోటీచేసి ఓటమిపాలయ్యారు. 2019లో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ఆదిమూలంనే అభ్యర్థిగా ప్రకటించి కోనేటి కుటుంబానికి ఊపిరిపోశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఎమ్మెల్యే ఆదిమూలం ప్రజాసేవపై దృష్టి సారించకపోవడం, ఎస్సీ సామాజికవర్గాన్నే చిన్నచూపు చూడడం, తన కుమారుడు సుమన్ అధికారులు, స్థానికుల పట్ల దురుసుగా ప్రవర్తించడం, వారిపై చేయిచేసుకోవడం వంటి కారణాలతో నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆదిమూలంపై వ్యతిరేకత తారస్థాయికి చేరింది.

వెన్నుపోటుకు సిద్ధమైన ఆదిమూలం

వ్యతిరేకత విషయాన్ని గ్రహించిన ఎమ్మెల్యే ఆదిమూలం ఈసారి తనకు స్థాన చలనం తప్పదని భావించి, టీడీపీకి దగ్గరయ్యేందుకు ప్రణాళిక రచించారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు వైఎస్సార్‌సీపీపై, ప్రభుత్వ పెద్దలపై అసత్యప్రచారం చేయడం ప్రారంభించారు. మంత్రి పెద్దిరెడ్డిపై మరీ చెలరేగిపోయారు. అయినా వైఎస్సార్‌సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే ఆదిమూలంకి ప్రమోషన్ ఇచ్చి తిరుపతి పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా ప్రకటించారు. దీన్ని బూతద్దంలో చూపించేందుకు ప్రయత్నించి భంగపడ్డారు. చంద్రబాబు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే ఆదిమూలం, కొడుకు సుమన్‌ని మాజీమంత్రి అమరనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు శ్రీకాళహస్తికి పిలుచుకుని మంతనాలు నెరిపారు.

కండువా కప్పుకోక ముందే తీవ్ర అవమానం

ఎమ్మెల్యే ఆదిమూలం, కొడుకు సుమన్ టీడీపీ కండువా కప్పుకోకముందే తీవ్ర అవమానాలు ఎదుర్కొంటున్నారు. నెలరోజులవుతున్నా కనీసం చంద్రబాబునాయుడు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదు. ఆదిమూలంకి సత్యవేడు అభ్యర్థిత్వం కూడా లేనట్టేనని జిల్లాలో జోరుగా ప్రచారం జరుగుతోంది.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం



మాట్లాడుతున్న ఆర్జేడీ రాఘవరెడ్డి



సమీక్షలో పాల్గొన్న ఎంఈఓలు, హెచ్‌ఎంలు

- పకడ్బందీగా పది పబ్లిక్ పరీక్షల నిర్వహణ
- సమీక్షలో వైఎస్ఆర్ కడప జిల్లా ఆర్జేడీ రాఘవరెడ్డి

చిత్తూరు కలెక్టరేట్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో సర్కారు విద్యార్థుల ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పాఠశాల విద్య వైఎస్ఆర్ కడప జిల్లా ఆర్జేడీ రాఘవరెడ్డి అన్నారు. నూతన ఆర్జేడీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయన మొట్టమొదటిసారిగా జిల్లా పర్యటనకు విచ్చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో త్వరలో నిర్వహించబోయే పది పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు పటిష్ట ప్రణాళికను అమలు చేయాలన్నారు. ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం మరింత పెరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలని, ఈ విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఈఓ దేవరాజు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా హెడ్ మాస్టర్లు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఈ విద్యా సంవత్సరం 21,119 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని. మొత్తం 116 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అనంతరం నూతన ఆర్జేడీని ఎంఈఓలు, హెచ్‌ఎంలు పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఏడీ-1 విజయేంద్రరావు, జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ చాడేశ్వరి, చిత్తూరు డీవైఈఓ చంద్రశేఖర్, మదనపల్లి డీవైఈఓ శ్రీరామ్ పురుషోత్తం, జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం సెక్రటరీ హేమారెడ్డి, ఎంఈఓలు, పలు మండలాల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయండి

ఎంఈఓ- 1, 2లు సమన్వయంతో పని చేయాలని ఆర్జేడీ రాఘవరెడ్డి తెలిపారు. ఎంఈఓలు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలన్నారు. నాడు-నేడు రెండవ విడత నిధులు త్వరలో విడుదల అవుతాయని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సర్కారు స్కూళ్లు నాడు-నేడు పథకం ద్వారా అభివృద్ధి చెందాయన్నారు. తాను ప్రభుత్వ బడిలో చదివే సమయంలో తాగునీటి కోసం దూరంగా ఉన్న బావి వద్దకు వెళ్లేవాడినని చెప్పారు. ప్రస్తుతం సర్కారు స్కూళ్లలో అలాంటి సమస్యలు లేవని, మినరల్ వాటర్ ప్లాంట్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.

క్లుప్తంగా

స్టేట్ లెవెల్ ఇన్‌స్పైర్ సైన్స్ పోటీకి విష్ణు


ఎం.విష్ణు

శాంతిపురం: మారుమూల గ్రామమైన సి. బండపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి రూపొందించిన సైన్స్ నమూనా ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎం.విష్ణు యాదమరి మండలంలో జరిగిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో పాల్గొన్నాడు. భారత ప్రభుత్వం, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, సర్వశిక్షా అభియాన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీల్లో విష్ణు రూపొందించిన 'ఇంధన ఉత్పత్తి కేంద్రంగా డంప్ యార్డ్' ప్రాజెక్టు న్యాయనిర్ణేతలను ఆకట్టుకుంది. దీంతో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో ప్రాజెక్టును ప్రదర్శించే అవకాశం లభించింది. సి.బండపల్లికి చెందిన విష్ణు తల్లిదండ్రులు మునికృష్ణ, హేమలతకు ముగ్గురు సంతానంలో విష్ణు పెద్దవాడు. తండ్రి రాతి కార్మికుడిగా, అమ్మ వ్యవసా య కూలీగా పనిచేస్తూ పిల్లలను చదివిస్తున్నా రు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థిని, తనకు గైడ్స్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయులను హెచ్ఎం జానకిరామయ్య అభినందించారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు


రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ట్రాక్టర్, కారు

బైరెడ్డిపల్లి: పలమనేరు–కుప్పం జాతీయ రహదారిలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పలమనేరు మండలం జల్లిపేట గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ శివాజీ బైరెడ్డిపల్లె నుంచి పలమనేరుకు వెళ్తుండగా పలమనేరు సాయిగార్డెన్‌లో నివశిస్తున్న గోపి కారును అతివేగంగా నడుపుతూ ట్రాక్టర్‌ను వెనుక వైపు నుంచి ఢీకొన్నాడు. ఈ సంఘటనలో ట్రాక్టర్ రెండు భాగాలు కాగా, కారు రోడ్డు సమీపంలోని గుంతలో బోల్తా పడింది. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బైరెడ్డిపల్లె పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాహో ఇస్రో



- జీఎస్ఎల్‌వీ ఎఫ్14 ప్రయోగం విజయవంతం
- నింగిలోకి చేరిన ఇన్‌శాట్‌-3డీఎస్ ఉపగ్రహం
- సంబరాల్లో మునిగితేలిన యంత్రాంగం

సూళ్లూరుపేట: సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌లో సంబరాలు మిన్నంటాయి. షార్‌లోని రెండో ప్రయోగవేదిక నుంచి జీఎస్ఎల్‌వీ ఎఫ్14 ప్రయోగాన్ని శనివారం సాయంత్రం 5.35 గంటలకు విజయవంతంగా ప్రయోగించారు. ఈ ప్రయోగాన్ని 18.47 నిమిషాల్లోనే ముగించి 2,275 కిలోలు బరువు కలిగిన ఇన్‌శాట్‌-3డీఎస్ ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ఇన్‌శాట్‌-3 సిరీస్‌లో మూడో ఉపగ్రహాన్ని ప్రయోగించారు. వాతావరణ పరిశోధన, విపత్తుల గురించి ముందస్తు సమాచారాన్ని అందించేందుకు ఉపయోగపడే ఉపగ్రహాన్ని ప్రయోగించారు. ఈ ఉపగ్రహం ఐదు నుంచి పదేళ్ల వరకు సేవలను అందిస్తుంది.

సందడే సందడి

సూళ్లూరుపేట: షార్‌లో ప్రయోగించిన జీఎస్ఎల్‌వీ ఎఫ్14 రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు ఆంధ్ర, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి సుమారు ఐదేవల మందిదాకా తరలివచ్చారు. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోట వరకు కార్లు, స్కూల్ వ్యాన్లు, బస్సులు బారులు తీరాయి. రాకెట్ నింగికేగుతున్న సమయంలో వారంతా కొట్టిన చప్పట్లు, ఈలలు, కేకలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. జీఎస్ఎల్‌వీ ఎఫ్14 ప్రయోగం విజయవంతం కావడంతో ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

ప్రయోగం ఇలా ..

- జీఎస్ఎల్‌వీ ఎఫ్14 రాకెట్‌కు శుక్రవారం మధ్యాహ్నం 2.05 కౌంట్‌డౌన్ ప్రారంభం
- శనివారం సాయంత్రం 5.35 గంటలకు ప్రయోగం
- కోర్ అలోన్ దశలో 138.1 టన్నుల ఘన ఇంధనం, రాకెట్‌కు చుట్టూరా దున్న నాలుగు స్ట్రాపాన్‌బూస్టర్లలో నింపిన 170.7 టన్నుల ద్రవ ఇంధనాన్ని మండించి మొదటి దశ 2.31 నిమిషాలకు పూర్తి
- రాకెట్‌లోని రెండో దశను 2.29 నిమిషాలు మండించి 4.90 నిమిషాలకు పూర్తిచేశారు. ఈ దశలోనే రాకెట్ శిఖరభాగంలో ఉపగ్రహాన్ని అమర్చిన హీట్‌షీల్డ్స్ 3.57 నిమిషాలకు విడిపోయాయి.
- మూడోదశ అంటే క్రయోజనిక్ దశను 4.55 నిమిషాలు మండించి 18.46 నిమిషాలకు కటాఫ్ అయింది. ఆ తరువాత 18.47 నిమిషాలకు ఇన్‌శాట్‌-3డీఎస్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టడంతో ప్రయోగం పూర్తయింది.

హామీలన్నీ నెరవేర్చాం.. ధైర్యంగా ప్రజల్లోకి వెళ్తున్నాం

- దళితులను ఓటు అడిగే హక్కు చంద్రబాబుకి ఎక్కడిది ?
- వచ్చే ఎన్నికల్లో మరోమారు జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందాం
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేయడానికి సీఎం జగనన్న సిద్ధంగా ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి, టీడీపీ, జనసేన పార్టీలను భూస్థాపితం చేయడానికి మీరు సిద్ధమా? అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. శనివారం ఆయన పుత్తూరులోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. కులం, మతం, ప్రాంతాలకు అతీతంగా పారదర్శకంగా పరిపాలన అందిస్తున్న ఏకైక వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. 'మీకు మంచి జరిగితేనే నాకు ఓటు వేయండి' అని చెప్పగలిగిన దమ్మున్న నాయకుడు జగనన్న అని అన్నారు. చంద్రబాబు మూడుసార్లు సీఎంగా పనిచేసి లక్షల కోట్లు సంపాదించుకున్నారని, ప్రజలు మాత్రం పేదలుగానే మిగిలిపోయారన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసి, ఓట్లు అడిగేందుకు ధైర్యంగా ప్రజల్లోకి వస్తున్నామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ విజయం సాధిస్తాం అని ధీమా వ్యక్తం చేశారు. తాము ఓట్లడిగేందుకు ప్రజల వద్దకు వెళ్తుంటే, పవన్‌కల్యాణ్ మాత్రం సీట్లు అడుక్కునేందుకు చంద్రబాబు వద్దకు వెళ్తున్నాడని ఆరోపించారు. ఎవరైన దళితులుగా పుట్టాలని కోరుకుంటారా ? అని చులకనగా మాట్లాడిన చంద్రబాబుకు నేడు దళితుల ఓట్లు అడిగే హక్కు ఎక్కడుంది అని ప్రశ్నించారు. చంద్రబాబు తన జీవితంలో ఎప్పుడైనా అంబేడ్కర్ విగ్రహం పెట్టారా ? నేడు ప్రపంచంలోనే ఎత్తైన అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డున ప్రతిష్టించిన ఘనత జగనన్నకే చెందుతుందన్నారు.

ఓటర్లను చైతన్య పరచండి


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ తులసి

చిత్తూరు రూరల్: నైతిక విలువలతో కూడిన ఓటింగ్ వైపు పయనించేలా ఓటర్లను చైతన్య పరచాలని డీఆర్‌డీఏ పీడీ తులసి తెలిపారు. చిత్తూరు నగరంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఆమె శనివారం ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో అవగాహన తీసుకు రావాలని సూచించారు. ఈసారి ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోండి

చిత్తూరు కార్పొరేషన్: శాశ్వత లోక్ అదాలత్ సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ ఎస్.రమేష్‌బాబు తెలిపారు. స్థానిక ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ కార్యాలయంలో శనివారం ప్రజాప్రయోజిత సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శాశ్వత లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయాన్ని పొందవచ్చన్నారు. ప్రజాప్రయోజనాల సంస్థలైన ప్రయాణికులు, సరుకుల రవాణా సంస్థలు, తపాలా, దూరవాణి, విద్యుత్ తదితర సంస్థలతో ఏదైనా వివాదాలు ఉంటే వాటిని శాశ్వత లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. ఇది అప్పీలు లేని తీర్పు అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఈఈ పద్మనాభపిళ్లై, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

14 మందికి కారుణ్య నియామకాలు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో కారుణ్య నియామకాల కింద 14 మందికి కలెక్టర్ షణ్మోహన్ ఆదేశాల మేరకు ఉద్యోగాలు ఇచ్చినట్లు డీపీఓ లక్ష్మి శనివారం తెలిపారు. వీరిలో ముగ్గురు గ్రేడ్‌-5 కార్యదర్శులుగా, 11 మంది గ్రేడ్‌-6 కార్యదర్శులుగా గ్రామ సచివాలయాలకు నియమించారు. చౌడేపల్లి మండలం అమినిగుంటకు ఎం.అర్జున్, సోమల మండలం పొదలకుంట్లపల్లికి ఎస్.హరిత, తవణంపల్లి మండలం మత్యంకు ఎస్.రోహిత్, పూతలపట్టు మండలం వడ్డేపల్లికి యూ.సందీప్, పెనుమూరు మండలం తాటిమాకులపల్లెకు ఎ.రాజేష్, పూతలపట్టు మండలం వేపనపల్లికి ఎస్.ఆయేషా, పెద్దపంజాణి మండలం తుర్లపల్లికి పి.దుర్గామాధవి, చిత్తూరు మండలం దిగువమాసాపల్లికి జి.మహేంద్ర, పెనుమూరు మండలం కలపకుంటకు ఎ.ఎన్ గోపీనాథ్, చౌడేపల్లి మండలం అమినిగుంటకు ఆర్.లోకేష్, గంగవరం మండలం కీలపల్లికి షేక్ మహమ్మద్, బైరెడ్డిపల్లి మండలం గొల్లధీమనపల్లికి జీఆర్ బాలాజీ, పులిచెర్ల మండలం వెంకటదాసరపల్లికి సి.భానుప్రకాష్, తవణంపల్లి మండలం సరకల్లుకు ఎ.హేమసాయిని నియమించారు.

అవుట్ స్టాండింగ్ విద్యాసంస్థగా సీకాం



భారత క్రికెట్ కెప్టెన్ రోహిత్ శర్మ నుంచి అవార్డు స్వీకరిస్తున్న సీకాం విద్యా సంస్థ డైరెక్టర్లు

తిరుపతి సిటీ: తిరుపతి సీకాం విద్యా సంస్థలకు ప్రముఖ లియో ఒన్ సంస్థ అవుట్ స్టాండింగ్ ఇన్‌స్టిట్యూట్ ఇన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్–2024 అవార్డును ప్రకటించింది. ముంబై కేంద్రంగా శనివారం ఆ సంస్థ ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డును ఇండియన్ క్రికెట్ టీమ్ కెప్టెన్ రోహిత్ శర్మ చేతుల మీదుగా సీకాం సంస్థల డైరెక్టర్లు టి.తేజస్వరూప్, ప్రణీత్ స్వరూప్‌లు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆ సంస్థల చైర్మన్ డాక్టర్ టి.సురేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ అవార్డు రోహిత్ శర్మ చేతుల మీదుగా అందుకోవడం చాలా గర్వంగా ఉందన్నారు. సీకాం విద్యా సంస్థ విద్యారంగంలో 44ఏళ్లుగా చేసి విశేష కృషికి ఫలితంగా ఈ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా 2023లోనూ ఇంటర్నేషనల్ స్కూల్ అవార్డ్స్ సంస్థ సీకాం విద్యాసంస్థకు ఎక్సలెన్స్ ఇన్ కో–కరికులమ్ యాక్టివిటీ అవార్డును ప్రకటించిందని గుర్తుచేశారు. సంస్థ అభ్యున్నతికి కృషి చేసిన కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి బకాయిల విడుదల

- కుప్పం నియోజకవర్గంలో నాలుగు మండలాలకు సంబంధించి
- రూ.17 కోట్లు రిలీజ్ చేసిన ప్రభుత్వం
- సర్వత్రా హర్షం

కుప్పం నియోజకవర్గ సమాచారం		
కుప్పం	-	రూ.4.58 కోట్లు
శాంతిపురం	-	రూ.7.14 కోట్లు
రామకుప్పం	-	రూ.3.62 కోట్లు
గుడుపల్లె	-	రూ.1.67 కోట్లు

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న వాటర్ బిల్లులను ప్రభుత్వం విడుదల చేసింది. నాలుగు మండలాలకు సంబంధించి రూ.17 కోట్లు నీటి బిల్లులు విడుదల కావడంతో గతంలో తాగునీటిని సరఫరా చేసిన ట్రాక్టర్ యజమానులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగేళ్లుగా బిల్లుల కోసం ఎదురు చూస్తున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీ, గ్రామస్థాయి నేతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే నీటి బిల్లులు మంజూరు కాలేదని పనిగట్టుకుని ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్షాలకు చెంప చెల్లుమనిపించినట్లు అయింది.

దాహార్తి తీర్చేందుకు..

2019 వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసింది. నిత్యం వందల సంఖ్యలో నియోజకవర్గంలో ట్రాక్టర్ల ద్వారా మారుమూల గ్రామాలకు పలువురు తాగునీరు సరఫరా చేశారు.

రూ.17 కోట్లు విడుదల..

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పెండింగ్‌లో ఉన్న వాటర్ బిల్లులు రూ.17 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రంలో ఏర్పడిన కరోనా విపత్తు పరిస్థితుల్లో, రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా బిల్లులు సకాలంలో మంజూరు కాలేదు. దీంతో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసిన వారు బిల్లుల కోసం పలుమార్లు మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ప్రభుత్వం రెండు రోజుల కిందట నియోజకవర్గానికి సంబంధించిన పూర్తి బిల్లులను విడుదల చేసింది.

ఆలస్యమైనా అందరికీ న్యాయం



వాటర్ బిల్లులు సకాలంలో మంజూరు కాలేదు. కానీ ఇప్పుడు విడుదల కావడంతో అందరికీ న్యాయం జరిగింది. వైఎస్సార్‌సీపీ పాలనలో 2 ఏళ్ల కరోనా వల్ల అంతా ఇబ్బంది పడ్డారు. వాటర్ బిల్లుల సమస్యను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిస్థితిని వివరించాను. దీంతో నియోజకవర్గానికి రావాల్సిన మొత్తం నిధులను ప్రభుత్వం విడుదల చేయడం సంతోషకరం.

\- భరత్, ఎమ్మెల్సీ